

# శర్మిల

ఇసుకపల్లి లక్ష్మీనరసింహ శాస్త్రి

బస్సు గర్ గర్ మంటూ స్పీడుగా నే మెలికలుమెలికలుగా కొండనుచుట్టేస్తోంది. డ్రైవరు మాంచి పట్టుగా ఎడంవైపు బస్సును తిప్పేటప్పటికి యాత్రికులంతా కుడివైపు ఒక్క వూపులో జరుగుతున్నారు, కొంతమందికి యినపకడ్డీలు కొట్టుకుంటున్నాయి. కొంతమందికి తలలు బొప్పెలు కడుతున్నాయి. కాస్త జాగ్రత్తగా వున్నవాళ్ళు నిభాయించుకుంటున్నారు.

శ్యామల తిరుపతి వెళ్ళటం అదే మొదటిసారి. బస్సు గుండ్రంగా తిరుగుతూవుంటే యెంతో వింతగా వుంది. అంతకంటె ఆశ్చర్యంగా వుంది తన పక్కనే కూర్చున్న మోహన్ అమాంతం తన మీదకు ఒడిగి తగలడం. ఆమె వళ్ళు గగుర్పొడుస్తోంది. చప్పున ఓరకళ్ళతో భర్త మొహంలోకి చూసీ చూడకుండా కళ్ళు తిప్పేసి మళ్ళీ క్రిందకు చూస్తోంది. ఆ గట్టి శరీరం

తన మెత్తని జబ్బలమీద తాకేటప్పటికి ఒళ్ళు ఝల్లుమంది. ఆ చిన్న సీటులోనే యింకా జరిగి జరిగి మరీ దగ్గరగా కూర్చుంటున్నాడు మోహన్. శ్యామల కాస్తంత కిటికీవైపు జరుగుతోంది. జరుగుతున్నట్టు భావనేకానికదలటంలేదు చోటు అసలే తక్కువ. శరీరాన్నంతా ముడుచుకొని గువ్వలా కూర్చుంది. మోహన్ కొంటెగా తనను గట్టిగా తగలాలని అట్లా వూగుతున్నాడనికూడా అనుకుంది. తల ఎటంవైపు తిప్పి కళ్లు టపటప మనిపించింది. అతను చూసీ చూడకుండా వుండిపోయాడు.

"భయంగా వుందా?..." ఈ ప్రశ్నకు సమాధానంలేదు.

"ఆదివరకు యెప్పుడూ వెళ్ళలేదు గదూ ?..." దానికీ సమాధానం లేదు.

భార్య కళ్ళల్లోకి చూట్టానికి ఆమెవైపు తల తిప్పాడు. మొహం తిప్పేసింది శ్యామల.

శ్యామలకు మహా బిడియం. అమిత మైన సిగ్గు. తన క్లాస్‌మేట్స్‌తో మాట్లాడటమే అంతంతమాత్రం. ముక్తసరిగా వుండటం, అవసరమయితే పెదిమలు కదిలించటం. లేకపోతే తలవంచుకుని సూటిగా కాలేజీనుంచి యింటికి వచ్చేసెయటం, తనతో బాగా చనువుగా వున్న సరళతోనూ అంతే. చీటికి మాటికి వచ్చే విమలతోనూ అంతే.

మేం మగపురుషులం కాదులే. కాస్తంత తల పైకెత్తి మా వంక చూడు అంటూ కరుణ, మాధవి యెగతాళి చేసే వాళ్ళు. ఎవరేమన్నా తన తీరు తనదే. తన మనసులో మాట ఎవ్వరికీ చెప్పేది కాదు. తనలో తానే మధనపడేది. బాధ పడేది. సంతోషపడేది.

ఆ రోజులన్నీ గుర్తుకొస్తున్నాయి. శ్యామల మనస్సు గజిబిజిగా వుంది. ఆందోళనగా వుంది. మరుక్షణంలోనే నల్లమబ్బులు వీడిపోయిన తెల్లాకాశం లాగా నిర్మలంగా వుంటోంది. కాని తనకు తెలియకుండానే తన మనస్సు ఆరాటపడుతోంది. ఆ క్షణంలో మోహన్ను తలుచుకుంటే భయంగా వుంది. అతను మరీ మరీ దగ్గరగా తాకుతూ కూర్చున్నాడు అనే భావన తనను ఉద్రిక్తురాల్ని చేస్తోంది. తన భుజం మీదికి బలంగా మోహన్ శరీరం తాకేటప్పటికి గతుక్కుమంది.

తనను ఎంతోమంది చూశారు. తాను యెంతోమందిని చూసింది. ఏదో కారణంగా ఏ సంబంధం కుదర్లేదు. తల్లితండ్రులు చాలా బాధపడుతూవుండే వాళ్ళు. శ్యామలకు మాత్రం ఏ విధమైన ఆదుర్దా వుండేదికాదు. పెళ్ళిచూపులకు వస్తున్నా రమ్మాయి అంటే మామూలేగా అంటూ నవ్వి వూరుకునేది. నోటి వెంబడి మాటరాదు. ఆ అనదు, ఈ అనదు. యిలాంటి పిల్ల రేపు పెళ్లయి అత్తారింటికి వెళ్ళి ఎట్లా కాపురం

చేస్తుందో ఏమో అని శ్యామల తల్లి మహా తపనపడేది.

చివరకు ఆ ఘడియ రానే వచ్చింది. మోహన్ వచ్చి కుర్చీలో కూర్చున్నాడు. శ్యామల తలవంచుకొని ఆనాడే పెళ్ళి కూతురయింది. "మా అమ్మాయికి మహా సిగ్గండి. కాలేజిలో చదువుతోం దన్నమాటే తప్ప యీ కాలపు పిల్లల తీరులు యేమీ రాలేదు" అంటూ శ్యామల తల్లి మొదలుపెట్టేటప్పటికి మరీ మెలికలు తిరిగిపోయి ముసిముసి నవ్వులు నవ్వుతూ యింకా మొహాన్ని క్రిందకు దాచుకుంది. మోహన్ అతనితోపాటు వచ్చినవాళ్ళు ఆ అమ్మాయితల్లి చెప్పింది నిజమేనని సంతోషపడ్డారు. పెద్దగా ఆర్భాటం లేకుండా పెళ్ళి జరిగిపోయింది.

శ్యామల ఒక్క కుదుపుతో ముందుకు వంగింది. నుదురు కొంచెం గట్టిగా ముందు సీటు యినప కడ్డీకి తగిలింది. మోహన్ చప్పున చెయ్యి అడ్డంపెట్టి "దెబ్బ తగిలిందా" అన్నాడు. లేదు అన్నట్టు 'ఉహు' అంది. అప్రయత్నంగా శ్యామల యిట్టే తల పైకెత్తింది. మోహన్ కళ్ళు రెండూ ఆమె కళ్ళల్లోకి సూటిగా చూసినాయి. ఆమె పెదిమలు తడబడ్డాయి. నుదురు మీద సన్న సన్నగా నీటిబిందువులు చేరినాయి. నల్లటి కాటుక వత్తుగా కనురెప్పలమీద తళతళ మెరిసింది. చెమికీ బొట్టులోంచి కాంతి కిరణాలు మోహన్ మొహంమీద పడ్డాయి. ఉబ్బిన బుగ్గల్లోంచి గులాబి కాంతులు ఛాయగా కనిపించినాయి. మోహన్ ఆశ్చర్యంగా ఆమె మొహంలోకి క్షణకాలం చూశాడు. ఆ చూపుల బరువుకు ఆమె తల వంచేసుకుంది.

"గోవిందా, గోవింద!" అనే కేకలు వినపడ్డాయి. బస్సు మెల్లిగా కొండ మీదకొచ్చి ఆగింది మోహన్ లేచి నిలబడ్డాడు. అతని ప్రక్కనే శ్యామల పమిటకొంగు సర్దుకుంటూ చీరె మడత లన్నీ సరిచేసుకుంటూ అటూ యిటూ చూస్తూ రెండుకాళ్ళమీద నిటారుగా నిలబడింది. తనూ పొడుగే. సరిగ్గా మోహన్‌కు ఓ గుప్పెడు తక్కువగా వుంటుంది అనుకుంది.

అతని వుంగరాలజుట్టు, విశాలమైన శరీరం శ్యామల కళ్ళను ఆకట్టేసినాయి. తనలో తాను ఏమిటో అనుకుంది. క్షణంలోనే తలవంచుకుని ఆతని వెంబడే అడుగులు వేస్తూ బస్సు మెల్లిగా దిగేసింది.

దీపాలు అపుడే మిణుకు మిణుకు మంటూ కనిపిస్తున్నాయి. దూరాన్నుంచి గంటల చప్పుడు వినిపిస్తోంది. బస్సు ల్లోంచి దిగేవాళ్లు, బస్సుల్లోకి ఎక్కేవాళ్లు జనం కిటకిట లాడుతున్నారు. మోహన్ కాటేజ్ అదివరకే రిజర్వ్ చేసు కున్నాడు. సూటిగా కాటేజ్‌కు యిద్దరూ వెళ్ళిపోయారు. తలొక కుర్చీలో కూర్చున్నారు. మోహన్ ఏమడిగినా

ఊ అనో ఆ అనో సమాధానం తప్ప ఒక్క వాక్యం కూడా పూర్తిచెయ్యటం లేదు. ఆమె వంక చూస్తూ ముగ్ధుడయి పోతాడు, అంతే. తాను వేసే ప్రశ్నలకు సమాధానాలు కూడా తనకు తెలుసు. అందుకనే ఒక్కొక్క ప్రశ్న వెయ్యబోయి మళ్లీ మెదలకండా వూరుకున్నాడు

స్వామి దర్శనంతో మోహన్‌కు యిక్కడికి వచ్చినపని పూర్తయింది. అతనికి బాగాతెలుసు. శ్యామల ఎప్పుడూ బిడియపడుతూ వుంటుంది. తన స్నేహితులతో పరిచయం చేసినప్పుడు అసలు ఆమె తలెత్తనే లేదు. తన భార్య చాలా అందమయిందని తను వాళ్ళకు చూపించాలనే ప్రయత్నం విఫలమయి పోయింది. అప్పుడేమీ అనలేదు, మహా ప్రేమగా ఆప్యాయంగా కాస్త తలెత్తు అని మెల్లిగా ఆమె చెవిలో వూదాడు. ఆ చప్పుడుకు గిలిగింతలు పెట్టినట్టయింది. శ్యామల మొహం విప్పారింది. నవ్వుమొహం పెట్టింది. కాని తల మాత్రం యెత్తలేదు. తాను దగ్గరగా ఆమె మొహాన్ని చూడగలిగాడు, అంతే. స్నేహితులు కిలకిల నవ్వుతూ వెళ్ళిపోయారు.

ఆనాడు మాత్రం మొహంలో మొహం పెట్టి చూడాలని యెంత తపనపడ్డా వీలు పడింది కాదు. దగ్గరకు తీసుకుని గట్టిగ కౌగలించుకున్నాడు. ఆమె మొహం అటువైపు తిప్పేసింది.

చక్కిలిగింతలు పెట్టాడు, పమిట లాగాడు, కదలేదు. రెండు చేతులు ఎదురు రొమ్ములమీద వెడల్పుగా పెట్టుకుని మొకాళ్ళకుతల ఆనించుకుని కూర్చుంది. ఆమె తీరు అంతే. శ్యామలను చూస్తూ తనను తాను మర్చిపోతాడు. ఎంతోమంది స్నేహితులింటికి వెళ్ళాడు, కాని ఏ స్నేహితుని భార్య కూడా శ్యామలకు సరిపోదు. ఆమె అందం వేరు. ఆమె తీరు వేరు. తనలో తాను ఆలోచించుకుంటున్నాడు.

రాత్రి పదయినా ఆ కొండమీద పగలుగానే వుంది. లైట్ల కాంతి వెలుగు అంతా తెల్లగానే కనిపిస్తోంది. ఇద్దరూ వాకిట్లోకి వచ్చి నిలబడ్డారు. మోహన్ ఏమిటో చెపుదామనుకుంటున్నాడు. పెదిమలదాకా వచ్చి ఆగిపోతున్నాయి మాటలు తనలో తాను సమాధానపడుతున్నాడు. దైవదర్శనానికి వచ్చాం, తిరుమలలో స్వామివారి సన్నిధిలో వుంటున్నాము, తన కోరిక సబబు కాదేమో ! తనలో తాను తర్కించుకుంటున్నాడు.

'పద్దాటింది'... అంటూనే మెల్లిగా గదిలోకి వెళ్ళిపోయాడు. మంచంమీద వెల్లికిలా పడుకున్నాడు, ఆలోచనల బరువుతో కళ్ళు మూతలుపడుతున్నాయి. బలవంతంగా తెరుచుకుంటూ వాకిటివైపు చూస్తున్నాడు శ్యామల అట్లాగే నిలబడి వుంది. ఇంకా లోపలికి రావే అని అన



బోతుండగానే శ్యామల కిలకిల నవ్వుతూ దభాలున లోపలికి యిట్టే వచ్చేసింది. మోహన్ చూస్తూ తనలో తాను తర్కించు

కున్నాడు, మధనపడ్డాడు. ఆరాట పడ్డాడు, ఆందోళనపడ్డాడు. చివరకు ఇట్టే సమాధానపడ్డాడు. కళ్లు మూతలు

పడిపోయినాయి గుర్రుపెట్టి నిద్ర పోయాడు.

పడమటవైపు కిటికీ దగ్గర మనిషి ఛాయ పడింది. శ్యామల దుప్పటి తీసి కొంచెం తల పైకెత్తి మోహన్‌వైపు చూసింది. గాఢంగా గుర్రుపెట్టి నిద్ర పోతున్నాడు. మంచం మీదనుంచి శ్యామల మెల్లిగా లేవబోయింది. మంచం కిర్రుమని చప్పుడయింది. గుండె ఝల్లుమంది. పెద్దగా నిట్టూర్చి గుటకలువేస్తూ అరికాలు మడంమీద నిలబడి రెండోకాలు అతి నెమ్మదిగా కిందకు దించింది. కుడి చేత్తో ఆ మంచాన్ని కాస్త నొక్కి పూర్తిగా లేచి నిలబడింది. తలుపు తీసుకుని కళ్ళు విప్పుకుని గాలిస్తోంది.


మోహన్ హాయిగా ప్రశాంతంగా మైమరిచి గాఢంగా మంచంమీద నిద్రపోతున్నాడు.

శ్యామల వాకిట్లోకి వెళ్ళి అటూ ఇటూ చూసింది. వదిగి వదిగి ప్రక్కగా నిలబడ్డ శ్రీనివాస్ కనిపించాడు.

చప్పున ఏవేవో గుర్తుకొచ్చి శ్యామల మనస్సు కలవరపడిపోయింది. నిజానికి శ్రీనివాస్‌తో తన పెళ్ళి అయి పోయి వుండాల్సింది. అట్లా కాలేదు. కాకపోవటానికి అతనెంత కారణమో తనూ అంతే కారణం. ఈ జీవితంలో తాను గాఢంగా ప్రేమించింది శ్రీనివాస్‌ను ఒక్కణ్ణే. అతన్ని మరిచిపోయి తాను బతకలేదు. శ్రీనివాసూ అంతే. తనను చూడకపోతే అతను పిచ్చివాడయి పోతాడు. ఈ బంధం యీనాటిది కాదేమో! ఇంత అనుబంధం పెరిగిన యిద్దరి మధ్య యింత అగాధం ఎందుకు కలిగిందో అర్థంకావటం లేదు. కాని ఎడబాటు సహించలేదు. తపన భరించ లేదు. తనలో యీ బలహీనత ఎందుకు కలిగిందో ఊహించ లేకపోతోంది. వెనక్కి తిరిగింది. వాకిట్లోకి కూడా మోహన్ గుర్రు విన పడుతోంది. చప్పున నిలబడిపోయింది.

కళ్ళు నిలిపేసింది. తన ఆలోచనలన్నీ చెల్లాచెదరయి పోయినాయి. తనకు పెళ్ళయిపోయింది. తానొక యింటి యిల్లాలు. శ్రీనివాస్‌తో తనకు యే సంబంధమూ లేదు. తాను మనస్సు చిక్కపట్టుకోవాలి. ఇహ యెప్పుడూ కూడా శ్రీనివాస్‌వైపు మరల్చకూడదు. అవును నిజమే అతన్ని రమ్మన్నాను. ఫలాన రోజు తిరుపతి వెళుతున్నాం అని ముందుగా చెప్పాను. అతను నా మాట మీదే వచ్చేశాడు. అతను యిప్పటికీ తననే కోరుకుంటున్నాడు. ఎట్లా సాధ్యం. ఇది అసాధ్యం. మోహన్ చాలా మంచివాడు. నేనంటే పంచ ప్రాణాలూను. నా మీద అవ్యాజమైన ప్రేమకు నేను యివ్వాలిసిన బహుమతి యిది కాదు. నేను విశ్వాసఘాతకురాలిగా జీవించలేను.

శ్యామలా ... ... సన్నటి స్వరం




వినబడింది. శ్రీనివాస్ పిలుస్తున్నాడు. ముందుకు ఒక్కొక్క అడుగు వేస్తున్నాడు. శ్యామల గుండె దడదడ కొట్టుకుంటోంది. ఆయాసపడుతోంది. కళ్లు గిర్రున తిరుగుతున్నాయి. మనస్సు వికలమయిపోతోంది. గుండె నిబ్బరం చేసుకుని నిటారుగా నిలబడింది. శ్రీనివాస్‌వంక ఎంతో గాంభీర్యంగానూ, ఆరిందాగానూ చూసింది. శ్రీనివాస్ నివ్వెరపోయాడు. ఏమిటో మాట్లాడబోయి కూడా ఆగిపోయాడు ఆమె వాలకం చూస్తూ ఆశ్చర్యపోయాడు. శ్యామలా అటూ నోట్లోనే మాటలు వుండిపోయినాయి.

శ్యామల చప్పున లోపలికి వెళ్ళి విసురుగా తలుపులు రెంటినీ వేసి గడియ పెట్టేసింది. కిటికీలోంచి శ్రీనివాస్ మొహం కనిపించింది. శ్యామల మొహం తిప్పేసింది ఉద్రేకంగా మోహన్ మంచంమీద అమాంతం వత్తిగిలి అతన్ని చుట్టేసింది. మోహన్ ఉక్కిరిబిక్కిరయిపోయాడు.

భళ్లున తెల్లారింది. కొండమీదనుంచి కిందకు దిగాలి బస్సుస్టాండ్ దగ్గర నిలబడ్డారు యిద్దరూనూ. శ్యామల బెరుకుగానూ భయంగానూ ఆవేశంగానూ అటూ యిటూ చూస్తోంది. మోహన్ ఒకటి రెండుసార్లు అడిగాడు "ఏమిటీ"

అని. సమాధానం చెప్పలేదు. మోహన్ ఆమెవంక చూస్తూ రాత్రి ఆమెఆవేశాన్ని తలచుకుంటున్నాడు. శ్యామల వంచిన తల యెత్తలేదు. మహా సిగ్గు. ఇంత భిడియం పనికిరాదు అని తనలో తాను నవ్వుకుంటున్నాడు.

శ్యామల వీపుమీద చరిచినట్టయింది. ఎవరో తరుముకొస్తున్నట్టు హడలి పోతోంది. అటూ యిటూ తపనగానూ అలసటగానూ అడుగులువేస్తూ తల తిప్పుతోంది. చాలా దగ్గరగానే శ్రీనివాస్ వస్తున్నట్టు గమనించింది. ఏం చేస్తాడో ఏమో అని భయపడిపోతోంది.

శ్యామలా అని బిగ్గరగా పిలుస్తున్నట్లుగా దద్దరిల్లిపోతోంది. మోహన్ ప్రక్కనే నిలబడి బస్సుకోసం నిరీక్షిస్తున్నాడు. ఇంతలోనే హఠాత్తుగా ఓ టాక్సీ వచ్చి నిలబడింది. ఇద్దరికి చోటుందన్నాడు.

శ్యామల, మోహన్ చెయ్యిపట్టుకుని బలంగా లాగింది. ఈ టాక్సీలో వెళ్ళిపోదాం అన్నట్టు చూపించింది. మొహమంతా చెమటలు కారుతున్నాయి. మోహన్ మారుమాటాడకుండాటాక్సీలోకి వచ్చి కూర్చున్నాడు. ప్రక్కనే శ్యామల వణుక్కుంటూ కూర్చుంది. టాక్సీ ఒక్క వూపులో ముందుకు వెళ్ళి మలుపు తిరిగింది.

'శ్యామలా' అనే కేక మోహన్‌కు కూడా వినపడింది. చప్పున తల ముందుకు రానిచ్చి చూశాడు, ఎవ్వరినీ పోల్చుకో లేకపోయాడు. శ్యామల మాత్రం తల వంచుకునే మాట్లాడకుండా కూర్చుంది. తనలో ఆవేదన ఆరాధన పైకి కనబడనీయకుండా ప్రయత్నం చేస్తోంది

ఎవరబ్బా పిలిచింది అనుకున్నాడు మనస్సులోనే మోహన్. శ్యామలను చూస్తూ ఆ కేకను యిట్టే మర్చిపోయాడు. శ్యామల యింకా దగ్గరగా వచ్చి మోహన్‌ను వెచ్చగా తాకింది. ఆమె ముంగురులు గాలికి అల్లల్లాడుతూవుంటే టాక్సీ కుదుపులో మోహన్ వెనక్కూ ముందుకూ వూగిపోతున్నాడు శ్యామల తల పైకెత్తి మోహన్‌వంక చూసి చప్పున రెండు చేతుల్తోనూ మొహాన్ని కప్పేసుకుంది.

అబ్బా ఎంత సిగ్గూ అనుకున్నాడు మోహన్.

